క్లుప్తంగా

చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి దివ్య

నందికొట్కూరు: ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత పారా లీగల్ వలంటీర్లపై ఉందని మండల లీగల్ సర్వీస్ కమిటీ, జూనియర్ సివిల్ జడ్జి దివ్య అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో పారా లీగల్ నూతన వలంటీర్లకు ఆమె చట్టాలపై అవగాహన కల్పించారు. మార్చి 8న జరిగే నేషనల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా కక్షిదారులను ప్రోత్సహించాలన్నారు. సీనియర్ న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరాముడు, సెక్రటరీ వెంకటరమణ, న్యాయవాది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఈఈ నాగరాజు

పాములపాడు: స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిన సైన్స్ ల్యాబ్ భవన సముదాయం రెండు నెలల్లో పూర్తి చేయాలని ఈఈ నాగరాజు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం ఆయన భవన నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఈ వీరయ్య, ఏఈ ప్రవీణ్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గోపాల్ ఉన్నారు.

అబుల్‌కలాం ఆజాద్‌కు ఘన నివాళి



చిత్రం పటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు: భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ వర్ధంతిని శనివారం రైతు సేవా సంఘం కార్యాలయంలో నిర్వహించారు. రైతు సేవా సంఘం గౌరవాధ్యక్షులు మోమిన్ మునీర్‌బాషా, అధ్యక్షులు బైరాపురం రహంతుల్లా, కృషి పండ్లతోటల సంఘం అధ్యక్షులు బైరాపురం మహబూబ్‌బాషా తదితరులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పంటల పరిశీలన



పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, ఏఓ

వెలుగోడు: మండలంలోని మాధవరం గ్రామ పరిధిలో సాగుచేసిన టీబీజీ -141, టీబీజీ-104(చెక్) విబిఎన్8 మినుము మినీకిట్ల క్షేత్రాన్ని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చైతన్య శనివారం పరిశీలించారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి హనుమంతరావు

నందికొట్కూరు: మద్యం ఎమ్మార్పీకే విక్రయించాలని కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి హనుమంతరావు సూచించారు. శనివారం స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించాలన్నారు. నవోదయ 2.0, ఎక్సైజ్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కేసుల గురించి ఎస్‌ఐ జప్రుల్లాను అడిగి తెలుసుకున్నారు. హెడ్ కానిస్టేబుళ్లు పద్మనాభం, కుమారి, శ్వేతరాణి ఉన్నారు.

ప్లాట్‌ఫాంల నిర్మాణం

పగిడ్యాల: జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో స్థానిక సంతమార్కెట్ ఆవరణంలో ప్లాట్‌ఫాంల నిర్మాణం చేపట్టినట్లు పంచాయతీ రాజ్ మండల ఇంజినీర్ జావేద్ శనివారం తెలిపారు. పనులు పూర్తయితే ప్రతి బుధవారం జరిగే వారపు సంతలో కూరగాయలు, మసాల సరుకులు, హోమ్ నీడ్స్ సామగ్రిని విక్రయించే వ్యాపారులకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు.

పనులు పూర్తాయే.. వేతనాలు కరువాయే!

ఉపాధి పనులు చేసి రెండు నెలలవుతున్నా కూలీలకు రూపాయి కూడా అందలేదు. 8 వారాల నుంచి రూపాయి కూడా కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. వలసలు నివారించేందుకు ఉపాధి కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప చెమటోడ్చి పనిచేసిన కూలీలకు వేతనాలు సరైన సమయంలో అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. 2024–2025 సంవత్సరానికి గానూ జరుగుతున్న పనులు మరో 35 రోజుల్లో పూర్తి కానున్నాయి. అయినా వేతనాలు మాత్రం పెండింగ్‌లోనే ఉండిపోయాయి. ఫలితంగా కొన్ని కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించింది.

– కొత్తపల్లి

- 8 వారాలుగా అందని వేతనాలు
- ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలు



ఎర్రమఠం సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కొత్తపల్లి మండలంలో 12 పంచాయతీలు, 19 మజారా గ్రామాలు ఉన్నాయి. 35 వేల జనాభా ఉంది. అందులో 7,350 కుటుంబాలకు ఉపాధి హామీ పథకంలో జాబు కార్డులు ఉన్నాయి. 5 వేల కుటుంబాలు ఏటా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే మండలంలో రోజుకు 400 నుంచి 480 లోపు మంది కూలీలు పనులు చేసుకుంటున్నారు. వారానికి సుమారు 2,820 మంది ఉపాధి కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఇలా 8 వారాలకు గాను 22,560 మంది ఉపాధి కూలీలు పనులు చేశారు. వీరికి 8 వారాలకు గాను రూ.1 కోటీ వరకు వేతనాలు రావాల్సి ఉంది. ఇంకా ఈ ఏడాది పనులు పూర్తయ్యేందుకు నెల గడువు ఉన్నప్పటికీ ముందుగానే పనులు పూర్తయ్యాయి. కొత్త పనులు ఇంకా గ్రామాల్లో గుర్తించలేదు. వచ్చే వారం పనులు ఉంటాయో లేదోననే సందిగ్ధంలో కూలీలు ఉన్నారు. ఈక్రమంలో చేసిన పనులకైనా డబ్బు ఇచ్చేలా చూడాలని కూలీలు అధికారులను కోరుతున్నారు.

అధికారులు చొరవ చూపాలి



8 వారాల నుంచి ఉపాధి పనులు చేస్తున్నాం. ఇప్పటిదాక ఒక్కవారం డబ్బు కూడా మా ఖాతాల్లో వేయలేదు. వేతనాలు అందకపోతే పనులకు ఎలా వెళ్లాలి. ఊర్లోనే పనిచేసుకోవచ్చనుకుంటే డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నాం. కనీసం 3 వారాల డబ్బులు వేస్తే ఖర్చులు తీరుతాయి. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా నా చొరచూపి వేతనాలు అందేలా చూడాలి.

– బాలరాజు, ఉపాధికూలీ, సింగరాజుపల్లె

రూపాయ కూడా ఇవ్వలేదు



నాలుగు వారాలుగా ఉపాధి పనులకు వెళ్తున్నా ఒక్క రూపాయ కూడా ఇవ్వలేదు. వేరే పనులకైనా వెళ్లినా బాగుండు. ఎప్పటికప్పుడే డబ్బు అందేది. ఊర్లో ఉంటూ పనికిపోవచ్చనే ఉద్దేశంతో ఉపాధి పనులుకు వెళ్లే ఇప్పుడు ఇల్లు గడవడం ఇబ్బందిగా ఉంది. నిత్యావసర సరుకులు కొనేందుకు కూడా డబ్బుల్లేవు.

– సత్యనారాయణ, ఉపాధి కూలీ, గువ్వలకుంట్ల

అర్థమయ్యేలా బోధించాలి

పాములపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక పూర్వ విద్యార్థులకు అర్థమయ్యేలా ఆటల పాటలతో విద్యా బోధన చేయాలని ఏసీడీపీఓ మంగవల్లి సూచించారు. శనివారం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు జరుగుతున్న శిక్షణా తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జ్ఞాన జ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకుని పిల్లలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ కృష్ణమూర్తి, కోర్స్ ఇన్‌చార్జ్ గోపాల్ పాల్గొన్నారు.

కుల గణన చేపట్టాలి

పాములపాడు: ఆంధ్రప్రదేశ్‌లో కుల గణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ గోపాల్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బీసీ కుల గణన కోసం దేశ వ్యాప్తంగా బీసీ జాతీయ సంక్షేమ సంఘం శ్రీకారం చుట్టిందన్నారు. బీసీ జనాభా లెక్కలు తీసి, జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో వాటాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో మాదిరిగానే రాజకీయ రంగాల్లో కూడా ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేపట్టి ఎంబీసీ కులాలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండల కార్యదర్శి రామ్మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



మాట్లాడుతున్న శిల్పా చక్రపాణి రెడ్డి

వెలుగోడు: కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శిల్పా మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఎవరికి భయపడవద్దన్నారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా పరిష్కారానికి తాను ముందు ఉంటానన్నారు. అధికార పార్టీ ఆగడాలను అందరూ కలిసికట్టుగా ఎదుర్కొందామన్నారు. అధికార పార్టీ నాయకులు అభివద్ధి కార్యక్రమాలు చేస్తే తాము పూర్తి సహకారం అందిస్తామని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడితో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తే దీటుగా జవాబు ఇస్తామన్నారు. అధికార పార్టీ వైఫల్యాలను అందరూ కలిసికట్టుగా ప్రజల్లోకి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు ఎండగడతామన్నారు. బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మళ్లీ వైఎస్ఆర్సిపిదే విజయం అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దేశం తిరుపెం రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

– మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



భక్తులకు అల్పాహారం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: అన్నం పరబ్రహ్మ స్వరూపమని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. వెంకటాపురం గ్రామంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరంలో శనివారం శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొని భక్తులకు అల్పాహారం వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌పీ నాయకులు, మండలాధ్యక్షులు రాజమోహన్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, విజయ్‌చౌదరి, సుల్తాన్, ఆలయ కమిటీ నిర్వాహకులు నాగిరెడ్డి, లింగారెడ్డి, రామిరెడ్డి, రామచంద్రారెడ్డి, వార్డు కౌన్సిలర్ సభ్యులు కరిముల్లా, రఫిక్, సురేష్ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీలు



బహిరంగ సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

ఆత్మకూరు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉపాధిహామీ బహిరంగ సామాజిక తనిఖీ తూతూ మంత్రంగా సాగింది. మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నా.. కేవలం రూ.90 వేలేనంటూ అధికారులు లెక్క తేల్చేశారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి పనులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీశాఖకు చెందిన పలు పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు స్పష్టమవుతున్నాయి. సామాజిక తనిఖీలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ బాలాజీనాయక్, ఏపీడీ అన్వరాబేగం ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ బృందం వివరాలను వెల్లడించింది. ఆత్మకూరు మండలంలో రూ.8,27,70,830 విలువ చేసే పనులు జరిగాయన్నారు. కేవలం రూ.6,90,31,488 ఉపాధి పనులు చేయగా, అన్ని గ్రామాల్లో జరిగిన పనుల్లో అక్రమాలు జరిగాయని బృందం వెల్లడించింది. గ్రామాలవారీగా పనుల్లో జరిగిన అక్రమాల వివరాలను పరిశీలిస్తే మండలంలో రూ.95,663 అక్రమాలు జరిగాయని, రికవరీ చేయాలని ఆదేశించారు. ఇంత జరిగినప్పటికీ ఏ గ్రామంలో ఎన్ని లక్షల పనులు జరిగాయో అధికారులు వెల్లడించకపోవడంలో తూతూ మంత్రంగా అధికారులు సమావేశాన్ని నిర్వహించారనే ఆరోపణలు వినిపించాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగభూషణ్‌శెట్టి, ఏపీఓ నాగమ్మ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

జూపాడుబంగ్లా: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ శ్రీనివాస రెడ్డి తెలిపారు. శనివారం శివస్వాముల కోసం తంగడంచ, జూపాడుబంగ్లా, 80 బన్నూరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాల వద్ద తాగునీటి సరఫరాను పరిశీలించారు. అన్ని చోట్ల మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నందున ఎలాంటి సమస్య తలెత్తే అవకాశం లేదన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చేతిపంపులకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఈయన వెంట ఏఈ నాగేంద్ర ఉన్నారు.

యుద్ధ గర్జనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోన నాగరాజు

నందికొట్కూరు: కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం జరగనున్న మాలల రాయలసీమ యుద్ధ గర్జనను విజయవంతం మాలమహానాడు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోన నాగరాజు కోరారు. శనివారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల ఓట్ల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుడు లెక్కలు చూపించి ఎస్సీ వర్గీకరణకు మొగ్గు చూపడం తగదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పినట్లు సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేయవచ్చని సలహాలు, సూచనలు ఇవ్వడం సమంజసం కాదన్నారు. సమావేశంలో మాలమహానాడు జేఏసీ నాయకులు జయరాముడు, డాక్టర్ రాజు, రాజ్‌కుమార్, తమ్ముడపల్లె ఏసేపు, డాక్టర్ వెంకటేష్, విజయ్, సామేలు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయండి



సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ సూర్యనారాయణ

వెలుగోడు: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన పీ4 సర్వే వేగవంతం చేయాలని ఆత్మకూరు డీఎల్‌డీఓ సూర్యనారాయణ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఒకటవ సచివాలయంలో సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ జీరో పావర్టీ, నైపుణ్యత పెంపు, ఉద్యోగాల సృష్టి, తాగునీటి రక్షణ, రైతు సాధికారత, వరల్డ్ క్లాసు ఇన్ ఫ్రా స్ట్రక్చర్, స్వచ్ఛ ఏపీ, మానవ వనరుల వినియోగం, శక్తి వనరుల నిర్వహణ, సాంకేతిక జ్ఞానం పెంపు తదితర 10 సూత్రాలపై సర్వే జరుగుతుందన్నారు. మార్చి 2లోగా సర్వే పూర్తి చేసి నివేదికలు ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, గ్రామ కార్యదర్శి సుంకన్న ఉన్నారు.

సంక్షిప్తం

కంటి అద్దాల పంపిణీ

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.కృష్ణ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి పాల్గొన్నారు.

బోర్డులపై తనిఖీ

కొత్తపల్లి: నందికుంట, కొత్తపల్లి, శివపురం, గోకవరం, దుద్యాల గ్రామాల్లో ఉపాధి పనుల బోర్డులను ఎన్ఆర్ఈజీఎస్ జిల్లా విజిలెన్స్ ఇన్‌చార్జ్ అధికారి బాలాజీ నాయక్ తనిఖీ చేశారు.

చలివేంద్రం ఏర్పాటు

పాములపాడు: శ్రీశైల క్షేత్రానికి వెళ్లే పాదయాత్రికులకు, భక్తులకు సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, మండల కార్యదర్శి సోమన్న పాల్గొన్నారు. అలాగే రైస్ మిల్ యజమాని జనార్దన్ గుప్తా అల్పాహారం ఏర్పాటు చేశారు.

రేపటి నుంచి ఆధార్ కేంద్రాలు

జూపాడుబంగ్లా: ఈనెల 24 నుంచి 28 వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ శనివారం తెలిపారు. ఈనెల 24, 25 తేదీల్లో తంగడంచ, 80బన్నూరు, 27న మండ్లెం, తరిగోపుల, 28న తర్తూరు, తరిగోపుల సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్‌కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

పురుగు మందులు అధికంగా వాడరాదు

కొత్తపల్లి: ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడరాదని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ రైతులకు సూచించారు. శనివారం దుద్యాల పొలిమేరలో మినుము పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఉపాధి పనులు కల్పించాలి

జూపాడుబంగ్లా: ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ గోపికృష్ణ సూచించారు. తన కార్యాలయంలో ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మంజూరైన సోక్‌పిట్స్‌లను తవ్వించుకునేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు.

భక్తుడికి వైద్యసేవలు

శ్రీశైలంప్రాజెక్ట్: అటవీమార్గంలో కాలినడక శ్రీశైలానికి వస్తున్న ఓ శివభక్తుడు శనివారం భీముని కొలను సమీపంలో మూర్చతో పడిపోగా.. రెడ్ క్రాస్ వైద్యసిబ్బంది వైద్య చికిత్సలు అందించారు. కోలుకున్న తరువాత సహాయకుల సహకారంతో కైలాసద్వారం వద్దకు చేర్చారు. అవసరమైన మందులను అందజేశారు.

ఓంకార క్షేత్రాన్ని సందర్శించిన ఏఎస్పీ

బండి ఆత్మకూరు: శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఓంకార క్షేత్రాన్ని ఏఎస్పీ జావలి సందర్శించారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా చర్యలపై పోలీసులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఏఎస్పీ వెంట ఎస్‌ఐ జగన్‌మోహన్ ఉన్నారు.

25న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

శ్రీశైలంప్రాజెక్ట్: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 25న ఇంటర్వ్యూలు ఉంటాయని ఎంపీడీఓ కేవీ సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు దరఖాస్తుఫారం, ఆధార్, రేషన్‌కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్‌లతో హాజరుకావాలన్నారు.

పరీక్షలపై భయం వీడాలి

కొత్తపల్లి: పరీక్షలపై భయం వీడాలని స్థానిక జిల్లా పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్‌కుమార్, సీఐటీయూ జిల్లా నాయకురాలు హరిత విద్యార్థులకు సూచించారు. శనివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

ఎమ్మెల్యే వినతుల స్వీకరణ

మహానంది: తహసీల్దార్ కార్యాలయం శనివారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీలైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేయాలని ఆయన అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, నియోజకవర్గ ప్రత్యేక అధికారి మురళీ కృష్ణ, పాల్గొన్నారు.

- **వెలుగోడు:** శ్రీశైలం నియోజకవర్గంలో ఉన్న మెట్ట భూములకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించాలని, రాష్ట్ర బడ్జెట్లో 15 శాతం నిధులు ఇరిగేషన్‌కు కేటాయించాలని, ధరల స్థిరీకరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని వేల్పనూరులో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి రైతు సంఘం జిల్లా నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

దుప్పికి గాయాలు

మహానంది: చుక్కల దుప్పి శనివారం మహానంది నుంచి ఎంసీ ఫారం వెళ్లే మార్గంలో ఉన్న తెలుగు గంగ కాల్వలో దిగి ప్రమాదవశాత్తూ కిందపడటంతో గాయాలపాలైంది. నందిపల్లెకు చెందిన కొందరు వ్యవసాయ కూలీలు గుర్తించి కాలువలోకి దిగి దుప్పిని రక్షించారు. అటుగా వెళ్తున్న కానిస్టేబుల్ నారాయణస్వామి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయంపై అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనాను ఆరా తీయగా విచారణ చేసి దుప్పికి వైద్యసేవలు అందిస్తామన్నారు.

ఘనంగా స్కౌట్ డే

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం స్కౌట్ డే ఘనంగా నిర్వహించారు. పాఠశాల నుంచి స్కౌట్ యూనిట్ ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. స్కౌట్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మ, ప్రిన్సిపాల్ నాగరవీంద్ర, స్కౌట్ మాస్టర్ మధు, గైడ్‌కెప్టెన్ వత్సల తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

పాములపాడు: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అధికారులకు సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 15 రోజుల్లోగా పరిష్కరించకపోతే అందుకు కారణాలు తెలియజేయాలని అధికారులకు సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెలిమిల్ల రహదారిలో అండర్‌పాస్ వంతెన సమస్యపై చెలిమిల్ల, లింగాల గ్రామ సర్పంచులు మల్లీశ్వరరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి స్వాములు వినతి పత్రం అందజేయగా ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్య తీవ్రమైనదని, తప్పని సరిగా సీఎం కార్యాలయానికి సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంఈఓ బాలాజీనాయక్ పాల్గొన్నారు.

- **నందికొట్కూరు:** బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి నియోజకవర్గ అధ్యక్షులు నల్లబోతుల రాముడు శనివారం అల్లూరు గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జయసూర్యను కలిసి వినతి పత్రం అందజేశారు. వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి నాయకులు శ్రీనివాసులు, శివశంకర్, రాముడు, నాయుడు, వెంకటేశ్వర్లు, రమణ, రాఘవేంద్ర, నాగరాజు, విజేయుడు, బాలసంజన్న, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

అలరించిన నృత్య ఉత్సవాలు







శ్రీశైలం: శ్రీశైలంలో మల్లికార్జున భ్రమరాంబికా దేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కళారాధనలో శ్రీశైల దేవస్థానం, నంద్యాల శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మహాశివరాత్రి నృత్య ఉత్సవాలు అలరించాయి. అంతకుముందు దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం శ్రీనివాసరావు, పబ్లిక్ రిలేషన్స్ అధికారి టి శ్రీనివాసులు, ఫెస్టివల్ డైరెక్టర్ డాక్టర్ పల్లంశెట్టి సురేష్ తదితరులు ఉత్సవాలను ప్రారంభించారు.

శివ భక్తులకు అన్నదానం



శివభక్తులకు అన్నం వడ్డిస్తున్న దాతలు

నందికొట్కూరు: పట్టణంలోని జమ్మిచెట్టు వద్ద దాతల సహకారంతో కాలినడకన వెళ్లే శివభక్తులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. 15 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం, అరటిపండ్లు, మజ్జిగ, తాగునీళ్లు సరఫరా చేసి మానవత్వం చాటుకుంటున్నారు.